క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కొమరోలు ఫీడర్ పరిధిలో కొమరోలు, గోపాలునిపల్లె గ్రామాల్లో, తాతిరెడ్డిపల్లె ఫీడర్ పరిధిలో పురుషోత్తంపల్లె, సర్విరెడ్డిపల్లె, తాతిరెడ్డిపల్లె, కె.బొంతపల్లె గ్రామాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన సాయిసురేంద్ర



సురేంద్రను అభినందిస్తున్న పాఠశాల పీడీ

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న జి.సాయి సురేంద్ర క్రీడాపోటీల్లో సత్తా చాటాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముక్తినూతలపాడులో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీల్లో టెన్నికాయిట్ అండర్–17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం ఎంఎస్ శర్మ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సురేంద్రను పీడీ మధుసూదనాచార్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సరుకుల లోడు ఆటో బోల్తా



సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన సరుకులు

కంభం: సరుకుల లోడుతో వస్తున్న ఆటో బోల్తా పడిన సంఘటన మంగళవారం స్థానిక హైవే రోడ్డుపై చోటుచేసుకుంది. వివరాలు.. మార్కాపురం నుంచి వంట సరుకుల లోడుతో కంభం వస్తున్న ఆటో జంగంగుంట్ల సమీపంలో అనంతపురం–అమరావతి హైవే రోడ్డుపై అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో సరుకులన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. అధిక లోడు కారణంగానే ఆటో అదుపు తప్పినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్

కొనకనమిట్ల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా గ్రామాల్లో బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఆవుల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు అందజేశారు. అర్హులైన వారి నుంచి నూతనంగా ఓటు హక్కు దరఖాస్తులు స్వీకరించడంతోపాటు తప్పులు సరిచేయాలని చెప్పారు. సమావేశంలో వీఆర్‌ఓలు, అన్ని గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మస్టర్ల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న సీఎల్‌ఆర్‌సీ శ్యాంసన్

మార్కాపురం రూరల్: మండలంలోని నూతనంగా విధుల్లో చేరిన ఎఫ్‌ఏలకు మంగళవారం రాయవరంలోని సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల కొలతలు, మస్టర్ల నిర్వహణ గురించి సీఎల్‌ఆర్‌సీ డి.శ్యాంసన్ వివరించారు. ఎఫ్‌ఏలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ కె.నిర్మలాదేవి, ఏపీఓ జీవరత్నం, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

8 మంది జూదరులు అరెస్టు

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి చేశామని, నిందితుల నుంచి రూ.5540 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ప్రజా సేవలకు సెలవేనా?

- ఒకప్పుడు కళకళ నేడు వెలవెల
- సచివాలయాల సేవలను కుదిస్తున్న కూటమి ప్రభుత్వం
- రేషన్‌కార్డులు, ఇళ్లపట్టాలు, పింఛన్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురుచూపులు
- సామాన్యుల్లో పెరుగుతున్న అసంతృప్తి



బేస్తవారిపేటలోని సచివాలయం



బేస్తవారిపేట: బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. ప్రజల వద్దకే పాలనే ధ్యేయంగా గిద్దలూరు నియోజకవర్గంలో 78, మార్కాపురం నియోజకవర్గంలో 59 గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి మండల కేంద్రాలకు వెళ్లకుండా సొంత ఊరిలోని సచివాలయాల్లో దాదాపు 554 సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. అంతకంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు తూట్లు పొడుస్తోంది. ప్రజా సేవలకు కోత పెడుతోంది. దీంతో ఎన్నికల ముందు టీడీపీ, జనసేన నేతలు చెప్పిన మాటలన్నీ బూటకమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్‌లు

ప్రజలకు ఎంతో అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతు భరోసా వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. ప్రజా సేవలను క్రమక్రమంగా తగ్గిస్తున్నారు. ప్రస్తుతం కుల, ఆదాయ, వన్‌బీ, అడంగల్ వంటి సేవలను మాత్రమే పొందుతున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాల సేవలను టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పింఛన్ల పంపిణీకే పరిమితం

గత ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో 1వ తేదీన వలంటీర్లు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల ఇంటి వద్దనే పింఛన్లు అందజేసేవారు. నేడు వలంటీర్లను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయాల ఉద్యోగుల పాత్ర కీలకం అనేది జగమెరిగిన సత్యం.

గతంలో కళకళ..

ఒక్కో గ్రామ/వార్డు సచివాలయ భవనాన్ని సుమారు రూ.45 లక్షలతో నిర్మించారు. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇవి ఎంతో దోహదపడ్డాయి. గ్రామీణులు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ అనుసంధాన సేవలు, వివిధ ధృవపత్రాలు, ఇలా.. ఎన్నో సేవలను గ్రామాల్లోనే పొందేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలన్నీ ప్రశ్నార్థకంగా మారాయి. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను పక్కనపెట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. సచివాలయ సేవలను కూడా తగ్గిస్తుండటాన్ని చూసి ప్రజలు తప్పుపడుతున్నారు.


గ్రామ సచివాలయాల ఉద్యోగుల హోదా, విధులు

	ఉద్యోగి హోదా	విధులు	పర్యవేక్షణ శాఖ
1.	పంచాయతీ కార్యదర్శి	గ్రామ సచివాలయ కన్వీనర్, పన్నుల వసూలు, పారిశుధ్యం, సంక్షేమ కార్యక్రమాలు	పంచాయతీరాజ్ శాఖ
2.	వీఆర్వో	భూముల పర్యవేక్షణ వ్యవహారాలు, పౌరసరఫరాలు	రెవెన్యూ శాఖ
3.	సర్వే అసిస్టెంట్	భూముల సర్వే	రెవెన్యూ (సర్వే)
4.	ఏఎన్‌ఎం	గ్రామ ప్రజల ఆరోగ్య పర్యవేక్షణ	వైద్య ఆరోగ్య శాఖ
5.	వెటర్నరీ లేదా ఫిషరీస్ అసిస్టెంట్	పశు వైద్యం, పాడి, మత్స్య శాఖ కార్యక్రమాలు	పశుసంవర్థక శాఖ
6.	మహిళా రక్షణ ఉద్యోగి	మహిళా పోలీసు, మహిళా కౌన్సెలింగ్, మహిళల రక్షణ	మహిళా శిశు సంక్షేమ శాఖ
7.	ఇంజినీరింగ్ అసిస్టెంట్	మంచినీటి సరఫరా, ఇతర ఇంజినీరింగ్ పనులు	పంచాయతీరాజ్ ఇంజినీరింగ్
8.	ఎలక్ట్రికల్ అసిస్టెంట్	విద్యుత్ సరఫరా, వీధి దీపాల పర్యవేక్షణ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం	పంచాయతీరాజ్ శాఖ
9.	అగ్రి, హార్టికల్చర్ ఎంపీఈవోలు	వ్యవసాయ సూచనలు, ఉత్పత్తి, మరియు మార్కెటింగ్	అగ్రికల్చర్, హార్టికల్చర్
10.	డిజిటల్ అసిస్టెంట్	గ్రామ సచివాలయంలో సింగిల్ విండో సిస్టమ్ పర్యవేక్షణ.	పంచాయతీరాజ్
11.	వెల్ఫేర్ అసిస్టెంట్	పింఛన్ల పంపిణీ, పొదుపు సంఘాలు, ఇతర అన్ని సంక్షేమ కార్యక్రమాలు, ఇళ్ల నిర్మాణం	సాంఘిక సంక్షేమ, గిరిజన శాఖలు

చీకటితో స్వాగతం!

- మార్కాపురం చెరువుకట్ట, గుండ్లకమ్మ బ్రిడ్జిపై వెలగని వీధిలైట్లు
- మున్సిపల్ అధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోకి ప్రవేశించే ప్రజలకు రాత్రి వేళ కారు చీకటి స్వాగతం పలుకుతోంది. గడిచిన రెండు వారాలుగా వీధి లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు తమ వాహనాల లైట్ల వెలుగులోనే బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్న దుస్థితి. మున్సిపల్, విద్యుత్‌శాఖాధికారుల మధ్య సమన్వయ లోపంతో మార్కాపురం రోడ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. మార్కాపురం–కంభం రహదారిలో ప్రధానమైన గుండ్లకమ్మ బ్రిడ్జిపై రాత్రి వేళ వీధిలైట్లు వెలగడం లేదు. పట్టణంలోని చెరువుకట్ట రోడ్డులోనూ అదే పరిస్థితి. దీంతో మందుబాబులకు, సంఘ వ్యతిరేక శక్తులకు గుండ్లకమ్మ బ్రిడ్జి అడ్డాగా మారింది. గత 15 రోజుల నుంచి వీధిలైట్లు వెలగకపోవడంతో కార్లు, బైకులపై ప్రయాణించేవారు మందుబాబుల దెబ్బకు హడలిపోతున్నారు. గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో జిల్లా వైద్యశాల ఉండటంతో నిత్యం రోగులు, వారి బంధువులు రాకపోకలు సాగిస్తుంటారు. వేములకోట, జేఆర్ కాలనీ, గవర్నమెంటు వైద్యశాల, కొట్టాలపల్లి, కోలభీమునిపాడు, జమ్మనపల్లి, ఎస్ కొత్తపల్లి, నికరంపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే పట్టణంలోకి వచ్చి వెళ్తుంటారు. వీధిలైట్లు లేని కారణంగా వీరంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి సాయంత్రం వేళ వెళ్లే భక్తులు తిరుగుప్రయాణంలో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. గుండ్లకమ్మ బ్రిడ్జి, దరిమడుగు బ్రిడ్జిల వద్ద రోడ్డుపైనే బర్త్‌డే పార్టీల పేరుతో కొందరు ఆకతాయిలు రచ్చ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



రాత్రి వేళ అంధకారంలో గుండ్లకమ్మ బ్రిడ్జి

ఘనంగా నాగుల చవితి



గొట్లగట్టులో మహిళల పూజలు

కొనకనమిట్ల: కార్తీక మాసం, నాగుల చవితిని పురస్కరించుకుని మంగళవారం నాగేంద్ర స్వామికి మహిళలు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వేకువజామునే పుట్ట వద్ద పూజలు చేశారు. పెదారికట్ల, ఎదురాళ్లపాడు, కొనకనమిట్ల, గొట్లగట్టు, చినారికట్ల, బ్రాహ్మణపల్లి, సలనూతల, అంబాపురం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

15 మద్యం బాటిళ్లు పట్టివేత



బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. 15 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా తయారు చేసి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో గిద్దలూరు!



నో పార్కింగ్ బోర్డు వద్ద నిలిపిన వాహనాలు



ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన అంబులెన్స్



పాములపల్లె గేటు వద్ద మసీదు నుంచి రాచర్ల రోడ్డుకు వెళ్లేందుకు వీలుపడక ఇరుక్కుపోయిన లారీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణ వాసులను ట్రాఫిక్ అవస్థలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా రాచర్ల గేటు, పాములపల్లె గేటు వద్ద ఆర్వోబీలు లేకపోవడంతో రైళ్లు వచ్చే సమయంలో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చే సమయంలో పాములపల్లె గేటు వద్ద నల్లబండ బజారు, పాములపల్లె గ్రామస్తులు, రాచర్ల గేటు వద్ద రాచర్ల రోడ్డు వైపు గల వెంకటేశ్వర కాలనీ, టీచర్స్ కాలనీ, రాంభూపాల్‌రెడ్డి కాలనీ, హనుమాన్ కాలనీలతో పాటుగా రాచర్ల, కంభం మండలాలకు వెళ్లే వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రైల్వే డబుల్ లైన్ పనులు పూర్తి చేసిన రైల్వే శాఖ రాచర్ల రోడ్డు నుంచి పాములపల్లె గేటుకు అనుసంధానంగా మరో కొత్త రోడ్డు నిర్మించింది. దీనివల్ల కొంత మేర ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించిందని అంతా భావించినా.. రోడ్డు మధ్య మసీదుకు చెందిన గదులు, బాత్‌రూమ్‌లు అడ్డుగా ఉండిపోయాయి. మసీదుకు ఆనుకుని తూర్పువైపు ఉన్న ఖాళీ స్థలాన్ని కేటాయిస్తే నూతనంగా వేసిన రోడ్డుకు అడ్డంగా ఉన్న గదులను తొలగించేదుకు సిద్ధంగా ఉన్నామని మత పెద్దలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు చర్చలు జరిపితే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు సైతం ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని క్లబ్ రోడ్డు, కొమరోలు రోడ్డు, యూనియన్‌బ్యాంక్, గణేష్‌నగర్‌లోని చిన్నమార్కెట్ సెంటర్, మెయిన్ బజారులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. దుకాణాలకు వచ్చే వారు వాహనాలను రోడ్లపై ఉంచి షాపింగ్‌కు వెళ్లడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఒక్కోసారి అంబులెన్స్ వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పోలీసులు ఎక్కడైతే నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారో అక్కడే వాహనాలు నిలిపివేస్తున్న తీరు గిద్దలూరులో ట్రాఫిక్ పరిస్థితికి అద్దం పడుతోంది.

రీసర్వేలో తప్పులు సరిచేసుకోవచ్చు



అంబాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కొనకనమిట్ల: భూముల రీసర్వేలో ఏవైనా తప్పులు జరిగితే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఆవుల సురేష్ చెప్పారు. మంగళవారం మండలంలోని చింతగుంట, వాగుమడుగు పంచాయతీ అంబాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో భూమి కొలతలు, విస్తీర్ణంలో మార్పులను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వెబ్‌ల్యాండ్–2లో ఉన్న భూమికి వ్యత్యాసం ఉంటే తగిన ఆధారాలతో గ్రామ సభలో అర్జీలు అందజేయాలని సూచించారు. గ్రామ సభలో ఆర్‌ఐ మహదేవరెడ్డి, వీఆర్‌ఓలు మౌనిక, శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమాకు రైతు వాటా చెల్లించాలి



కంది పంటలో మెళకువలు తెలియజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వాటా సొమ్ము చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని తాళ్లపల్లె, కొమ్మునూరు గ్రామాల రైతులకు మంగవారం అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప పంటలకు బీమా వర్తిస్తుందని వివరించారు. అనంతరం కంది పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది రాణాప్రతాప్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం రూరల్: రబీ సీజన్‌లో మినుము, శనగ, మొక్కజొన్న, జొన్న, వరి, ఎండు మిర్చి మొదలైన పంటలకు బీమా సౌకర్యం ఉందని, రైతులు తమ వాటా సొమ్ము చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని మండలంలోని నాయుడుపల్లి వీఏఏ పావనీశ్వరి రైతులకు వివరించారు. బీమా చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం పొందవచ్చని చెప్పారు.

విద్యాదీవెన, వసతి దీవెన ఏవీ?

కొమరోలు: విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రస్తుతం లేకపోవడంతో అర్హులైన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లుగా బీసీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు దివాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం కొమరోలులోని బీసీ చైతన్య సమితి కార్యాలయంలో దివాన్‌బాషా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులకు రావలసిన విద్యాదీవెన, వసతి దీవెన నగదును ఇంతవరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. విద్యనభ్యసిస్తున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వారు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కంది, మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ఏలూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఏవో

పొదిలి రూరల్: రైతులు కంది, మిరప పంటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో ఎస్‌కే జైన్‌లాబ్దీన్ పేర్కొన్నారు. మంగళవారం పొదిలి మండలంలోని ఏలూరు, ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. మిరప పంటలో ఆకు ముడత నివారణకు నాటిన 15 నుంచి 45 రోజులకు ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున భూమిలో వేయాలన్నారు. అంతేగాక మిరపలో కాయ కుళ్లు తెగులుకు కాయలు కొమ్మలు పండ్లపై నల్లటి మచ్చలు ఏర్పడుతాయన్నారు. దీని నివారణకు మొలకెత్తిన నాటి నుంచి మూడు రోజులకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడి పొందాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలకులు చట్టాన్ని ఉల్లంఘించడం దారుణం



దీక్షను ప్రారంభిస్తున్న సీఐటీయూ నాయకుడు సోమయ్య

మార్కాపురం టౌన్: రాజకీయ ఒత్తిడి మేరకు మార్కాపురం మున్సిపాలిటీలో తొలగించిన 21 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 22వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. 22 రోజులుగా కార్మికులు పోరాటం చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన అధికారులు, రాగద్వేషాలకు తావులేకుండా పరిపాలన సాగిస్తానని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన నాయకులు యథేచ్ఛగా చట్ట ఉల్లంఘనకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. 20 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు కనీసం నోటీస్ కూడా ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించడం రాజకీయ కక్ష కాక మరేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సుబ్బరాయుడు, హరి, షబ్బీర్, అబ్దుల్లా, కనకయ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



ఎస్సైని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బేస్తవారిపేట: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై సుదర్శన్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం అర్ధవీడు గురుకుల కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. కష్టపడి చదివితే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు స్ఫూర్తి పొందేలా తరగతి గదుల్లో ఎలాన్‌మస్క్, అబ్దుల్‌కలాం, టాటా, బిర్లా లాంటి ప్రముఖుల ఫొటోలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.